1St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 173

మంగళవారం 30 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## కేంద్ర మంత్రిమండలిలో మార్పులు?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 29)
కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇలాంటి అంశాలపై చివరి క్షణం వరకు గోప్యత పాటించడం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకత అయినా వివిధ సంకేతాలను బట్టి.. ఇప్పటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోగా ఏ క్షణమైనా పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని భావిస్తున్నారు. మంత్రిమండలిలో ఇప్పటికే ఖాళీగా ఉన్న, త్వరలో ఖాళీ కాబోతున్న స్థానాలను భర్తీచేయడంతోపాటు తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) వంటి పార్టీల నుంచి చీలికవర్గం ఎంపీలు ప్రత్యేక వర్గాలుగా ఏర్పడి భాజపాకు మద్దతు ప్రకటిస్తుండటంతో వాటి నుంచీ కొందరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉంది. భాజపా నూతన సారథి నితిన్ నబీన్ జట్టులో కీలకమైన పదవుల్ని కొంతమంది యువ నేతలకు అప్పగించే అవకాశముందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీ పదవుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చింది. కొందరు కేంద్ర మంత్రులతో నబీన్ కొద్దిరోజుల క్రితం చర్చలు జరిపారు. కొత్తవారిని మంత్రులుగా తీసుకోవడం, కొందరి శాఖల్ని మార్చడం వంటి వాటిపై సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సోమవారం వరకు సీషెల్స్ పర్యటనలో ఉండే ప్రధాని మోదీ తిరిగి జులై 6 నుంచి 11 వరకు విదేశాల్లో ఉంటారు. జపాన్ ప్రధాని సనాయె తకాయిచి జులై 1 నుంచి 3 వరకు మన దేశంలో పర్యటించనున్నారు.

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం.. ఆస్తులు జప్తు చేశాం: అనిత



**గంజాయి సాగును రికార్డు స్థాయిలో సున్నాకు చేర్చామన్న అనిత**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ▶మిగతా 2లో

## అన్నదాతకు సీఎం ఏరువాక పున్నమి శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు సీఎం చంద్రబాబు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారు. భూమిని, పశుసంపదను పూజించి.. ప్రకృతితో అనుసంధానమయ్యే కార్యక్రమమిదని సీఎం అన్నారు. వ్యవసాయ రంగ బలోపేతానికి కూటమి ప్రభుత్వం చొరవ ▶మిగతా 2లో

## ప్రభుత్వ సేవలు సులభతరం..
# ఫిర్యాదులకు 'మనమిత్ర'



- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- 'మనమిత్ర' పేరుతో వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్‌లతో సహా ఫిర్యాదుల స్వీకరణ
- సెక్రటరీలు, హెచ్ఓడీలు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని సర్క్యులర్
- మూడు నెలల్లో రాష్ట్రంలోని 3,000 ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి డెడ్‌లైన్
- 'నవచేతన' కింద పిల్లల ఎదుగుదలపై రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు, సేవలు పొందడంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, ప్రక్రియలను సులభతరం చేయాలని ఆయన స్పష్టం చేశారు. నేడు అమరావతి సచివాలయంలోని రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో నిత్యం సంబంధాలుండే శాఖల్లో సేవల సరళీకరణపై ప్రధానంగా దృష్టి సారించారు.ముందుగా 11 రకాల కీలక సేవల్లో అనవసరమైన ప్రక్రియలను కుదించి, వాటిని సులభతరం చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.




2

## కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు

**అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం**



(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం ,జూన్ 29)
వర్షాకాలంలో ప్రబలే డెంగీ, మలేరియా, గన్యా, విషజ్వరాలు, ఇతర కాలానుగుణ వ్యాధులను సమర్థంగా నియంత్రించడానికి జిల్లాల వారీగా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నేరుగా, రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులతో ▶మిగతా 2లో

## జగన్ పాలనలో రాయలసీమలో రక్తపుటేరులు పారాయి: బీసీ జనార్దన్

- కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధిలో దూసుకుపోతోందన్న జనార్దన్
- అభివృద్ధికి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్ అని కితాబు
- గొడ్డలి పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి బీసీ జనార్దన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో రాయలసీమలో రక్తపుటేరులు పారాయని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని... ఇక్కడ పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా జరుగుతున్న అభివృద్ధిని

## అన్నదాతలకు అండగా ఉంటాం

- ఏరువాక వేళ పవన్ కల్యాణ్ భరోసా
- రైతు సోదరులకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్
- అన్నదాతలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులు ఇప్పటికే జమ చేశామని వెల్లడి
- సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్ష
- వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని స్పష్టీకరణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని రైతు సోదరులకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలియజేశారు. జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన జరుపుకునే ఈ పండుగ.. భూమాతకు, పశు సంపదకు గౌరవం ఇస్తూ, ప్రకృతికి - మనిషికి మధ్య ఉన్న విడదీయలేని అనుబంధాన్ని చాటుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని రైతులు భూమికి పూజలు నిర్వహించి, నూతనోత్సాహంతో సాగు పనులకు శ్రీకారం చుడతారని పవన్ కల్యాణ్ తన సందేశంలో తెలిపారు. సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, తద్వారా అన్నదాతలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల ▶మిగతా 2లో



## అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
అబద్ధాలు, అసత్య ప్రచారాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మించిన వారెవరూ లేరని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రూ.5 వేల కోట్ల విలువైన పనులు మిగిలి ఉండగానే జాతికి అంకితం చేసి.. ప్రకాశం జిల్లా రైతులను మోసం చేసిన ఘనత గొడ్డలి పార్టీ అధినేత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం అందించాల్సి ఉండగా.. జగన్ హయాంలో ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను గాడిన పెట్టడంతో పాటు తాజాగా నిర్వాసితులకు పరిహారం అందిస్తే.. క్రెడిట్ చోరీ చేస్తున్నారంటూ జగన్ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రూ.792 కోట్ల విలువైన 20 శాతం పనులు చేసినట్లు లెక్కల్లో చూపారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 23 నెలల్లోనే రూ.759 కోట్ల విలువ చేసే పనులు పూర్తి చేసి చూపించామన్నారు. నల్లమల సాగర్ రిజర్వాయర్ నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్‌లో రూ.903 కోట్లు కేటాయించామన్నారు. ఇవన్నీ చూసి ఓర్వలేని జగన్ తన సొంత మీడియాలో అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారన్నారు. 'దోపిడీలు, హత్యలు, కిరాతకాలకు పేటెంట్ హక్కులు ఉన్న జగన్ క్రెడిట్‌ను చోరీ చేయడం ఎవరితరమూ కాదు' అని రామానాయుడు వ్యాఖ్యానించారు.

## అయోధ్య విరాళాల రగడ.. చంపత్ రాయ్‌కు వీహెచ్‌పీ మద్దతు

- రామమందిర నిధుల వివాదంలో చంపత్ రాయ్ రాజీనామాకు విపక్షాల పట్టు
- విచారణకు సహకరించేందుకే ఆయన రాజీనామా చేశారన్న వీహెచ్‌పీ చీఫ్ అలోక్ కుమార్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 29)
అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ గట్టిగా మద్దతు పలికారు. అంతేకాదు, రాయ్ రాజీనామాను డిమాండ్ చేసిన రాజకీయ నాయకులపై ఆయన తీవ్రస్థాయిలో ▶మిగతా 2లో

## వాళ్ల కోసమే పవన్ పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నారు: నాగబాబు



- గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికే పవన్ ఆ శాఖ తీసుకున్నాడని వెల్లడి
- గిరిజన గ్రామాలకు 1,069 కిలోమీటర్ల రోడ్లు వేశామని వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 29)
ఏపీలో పార్టీ బలోపేతంపై జనసేన పూర్తి స్థాయిలో దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ▶మిగతా 2లో

# కాకినాడ ఎమ్మెల్యే పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 29)**
గిద్దలూరు పోలీస్ స్టేషన్‌లో వైసిపి ఇన్‌ఛార్జ్ కుందూరు నాగార్జునరెడ్డి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపై ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి పై పంతం నానాజీ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల సమయంలో జగనన్న సభకు వచ్చే ప్రజలను చూస్తే చాలు పంతం నానాజీ స్వయంగా ఎన్నికల్లో పోటీ చేయడం మానుకుంటాడని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతతో మర్యాదగా మాట్లాడాలే కాని ఈ విధంగా అమర్యాదగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు.

# మానవత్వం చాటిన కలెక్టర్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 29)**
ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని దగ్గరుండి అంబులెన్స్‌లో ఎక్కించి హాస్పటల్ కు పంపించి మానవత్వం చాటుకున్నారు మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత. వివరాల్లోకెళితే మార్కాపురం-తర్లుపాడు రోడ్డులో సోమవారం మధ్యాహ్నం రెండు మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడి రోడ్డు పక్కన పడిపోయాడు. కలెక్టరేట్ నుంచి మార్కాపురం పట్టణంలోకి వెళుతున్న జిల్లా కలెక్టర్ తన వాహనాన్ని ఆపి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయించి గాయపడ్డ వ్యక్తిని దగ్గరుండి అబులెన్స్‌లో పంపించారు. దీంతో కలెక్టర్ సమయాస్ఫూర్తి, గొప్ప మనస్సుకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# పీజీఆర్ఎస్‌కు 212 అర్జీలు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)**
మార్కాపురం కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 212 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ సంబంధించి 141 ఇతర సమస్యలపై 71జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు శ్రద్ద చూపడం లేదని ఇది మంచి పద్ధతి కాదన్నారు. క్షేత్రస్థాయి పర్యటన చేయకపోవడం వల్లే కొన్ని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడంలేదన్నారు. ఇప్పటినుంచి జిల్లా స్థాయి అధికారులు ప్రతి బుధ, శుక్రవారాల్లో క్షేత్రస్థాయి పర్యటన తప్పనిసరిగా చేయాలన్నారు. ఐవిఆర్ఎస్ సర్వేలో 80% సంతృప్తి పెరిగేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. దీంతో పాటు రీ సర్వే, సర్ కార్యక్రమానికి సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్‌ఏ కరీం, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, అన్ని మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# కేంద్ర మంత్రిమండలిలో మార్పులు?

అందువల్ల ప్రధాని వెసులుబాటును బట్టి మంత్రిమండలిలో మార్పులు చేపట్టనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి కొందరు ఎంపీలను మంత్రిమండలిలోకి తీసుకోనున్నారు. శిందే నేతృత్వంలోని శివసేన పార్టీ నుంచి ఒక సీనియర్ నేతకు క్యాబినెట్ మంత్రి పదవి లభించనుందని తెలుస్తోంది. తృణమూల్, శివసేన (యూబీటీ) చీలిక వర్గాల్లో ఎవరికైనా అవకాశం ఇచ్చేముందు స్పీకర్ నిర్ణయం కీలకం కానుంది.

**గవర్నర్లుగా కేంద్ర మంత్రులు!**

గవర్నర్లుగా థావర్‌చంద్ గహ్లోత్ (కర్ణాటక), మంగూభాయ్ పటేల్ (మధ్యప్రదేశ్), గుర్మీత్‌సింగ్ (ఉత్తరాఖండ్)ల పదవీ కాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుత మంత్రుల్లో కొందరిని వీరి స్థానాల్లోకి పంపిస్తారని, ఆ మేరకు మంత్రిమండలిలో యువ రక్తాన్ని తీసుకువస్తారని చెబుతున్నారు. ఆప్ నుంచి విడిపోయి భాజపాలో చేరుతున్న ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరిద్దరికి విస్తరణలో బెర్తులు ఖాయం కానున్నాయి.

**వీరి భవితవ్యం ఏమిటో?**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ డిజిటల్ మూల్యాంకనంలో తప్పిదాల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవితవ్యం డోలాయమానంలో పడింది. రాజ్యసభ సభ్యులుగా నవంబరులో పదవీకాలం ముగిసిపోతున్న వారిలో కేంద్ర మంత్రులు హర్‌దీప్‌సింగ్ పురీ, బి.ఎల్.వర్మ ఉన్నారు. వారికి మరో అవకాశం లభిస్తుందా..లేదా అనేది తేలాలి. పంకజ్ చౌధరీ, హర్ష్ మల్హోత్రాలకు యూపీ, దిల్లీ రాష్ట్రశాఖల పార్టీ బాధ్యతల్ని అప్పగించారు. 'ఒకరికి ఒకే పదవి' నిబంధన కింద వీరిద్దరినీ మంత్రివర్గం నుంచి తప్పించేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి.

జార్జి కురియన్, రవ్‌నీత్‌సింగ్ బిట్టూల రాజ్యసభ పదవీ కాలం ఈ నెల 21న ముగిసింది. మంత్రి పదవికి కురియన్ రాజీనామా సమర్పించారు. పంజాబ్ ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిందిగా బిట్టూకు పార్టీ సూచించినట్లు సమాచారం.

**మూడు రాష్ట్రాలకు అగ్రతాంబూలం!**

ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌ల నుంచి పలువురికి ఈసారి మోదీ బృందంలో మంత్రులుగా అవకాశం రావచ్చని సమాచారం. ఈ మూడు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

# కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'ప్రతి గ్రామం, వార్డు స్థాయిల్లో జ్వరాల కేసులను ప్రారంభ దశలో గుర్తించి, వైద్య సేవలందించాలి. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ప్రభావిత గ్రామాల్లో సత్వర చర్యలు చేపట్టాలి. స్ప్రేయింగ్, మాస్ ఫీవర్ సర్వేలు, ఫాగింగ్ వంటివి చేపట్టాలి. అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలి. గిరిజన ప్రాంతాల్లో దోమతెరలు పంపిణీ చేయాలి. కీటక జనిత వ్యాధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో గతంలో కంటే రూ.59 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 21 వరకు ఎనిమిది జిల్లాల్లో 12.99 లక్షల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తే 2,682 మలేరియా కేసులొచ్చాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి తగ్గుముఖం పట్టాయి. తాగునీటి క్లోరినేషన్ పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి' అని మంత్రి ఆదేశించారు.

# జగన్ పాలనలో రాయలసీమలో రక్తపుటేరులు పారాయి: బీసీ జనార్ధన్

చూసి వైసీపీ నేతలు ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

"రప్పా.. రప్పా.. నరుకుతాం అంటూ ఫ్యాక్షన్ డైలాగులు చెబుతుంటే ఏ పారిశ్రామికవేత్త అయినా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారా?" అని జగన్‌ను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. ఆ భయానక వాతావరణం వల్లే గతంలో ఉన్న పరిశ్రమలు కూడా ఏపీని వదిలి పారిపోయాయని మండిపడ్డారు. డెవలప్‌మెంట్‌కు ఎప్పుడూ చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్ అని, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసీపీ నేతలు ఈరోజు సిగ్గు లేకుండా కూటమి ప్రభుత్వంపై మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వ కార్యాచరణ వల్ల ఎన్నో కొత్త పరిశ్రమలు రాయలసీమకు క్యూ కడుతున్నాయని మంత్రి వెల్లడించారు. కేవలం పరిశ్రమలు మాత్రమే కాకుండా... సీమ ప్రాంతాన్ని ఒక మెగా 'హార్టికల్చర్ హబ్' (ఉద్యానవన హబ్) గా మారుస్తున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయలసీమ ప్రజలే ఆ 'గొడ్డలి పార్టీ'కి బుద్ధి చెప్పబోతున్నారని, వారికి కనీసం డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు.

# అయోధ్య విరాళాల రగడ.. చంపత్ రాయ్‌కు వీహెచ్‌పీ మద్దతు

ఎదురుదాడికి దిగారు. అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాలు, వెండి ఇటుకలు వంటి విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో, నైతిక బాధ్యత వహిస్తూ చంపత్ రాయ్ ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయంపై సోమవారం మాట్లాడిన అలోక్ కుమార్, ఈ వ్యవహారంలో పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ట్రస్ట్ తీసుకున్న చర్యలే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు."ఈ ఆరోపణలు వెలుగులోకి రాగానే ట్రస్ట్ వెంటనే ప్రాథమిక విచారణ జరిపి, దోషులను గుర్తించి, రూ. 80 లక్షలు రికవరీ చేసింది. ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదిక ఆధారంగా 8 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది" అని అలోక్ కుమార్ వివరించారు. విచారణకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే చంపత్ రాయ్‌తో పాటు మరో ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా స్వచ్ఛందంగా తమ పదవుల నుంచి తప్పుకున్నారని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా, చంపత్ రాయ్ రాజీనామా కోరిన నేతల తీరును అలోక్ కుమార్ తప్పుబట్టారు. గతంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ ఎందరో నేతలు పదవుల్లోనే కొనసాగారని ఆయన గుర్తుచేశారు.

"అరెస్ట్ అయినప్పటికీ కేజ్రీవాల్ జైలు నుంచే ముఖ్యమంత్రిగా కొనసాగాలని పట్టుబట్టారు. జేఎంఎం ఎంపీల కొనుగోలు కేసులో మాజీ ప్రధాని నరసింహారావుపై, బోఫోర్స్ కుంభకోణంలో రాజీవ్ గాంధీపై ఆరోపణలు వచ్చినా వారెవరూ రాజీనామా చేయలేదు" అని విమర్శించారు. ఆప్, కాంగ్రెస్ సీనియర్ నేతల ప్రవర్తనకు, చంపత్ రాయ్ నైతిక ప్రవర్తనకు మధ్య ఉన్న తేడా ఇదేనని ఆయన వ్యాఖ్యానించారు.

# వాళ్ల కోసమే పవన్ పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నారు: నాగబాబు

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా జనసేన పార్టీ రాబోయే ఎన్నికల నేపథ్యంలో సరికొత్త వ్యూహాలతో ముందుకు వెళుతోంది. అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నట్లు జనసేన అగ్రనేత, ఎమ్మెల్సీ నాగబాబు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ జనసేన అభ్యర్థులను నిలబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాగబాబు తెలిపారు.

గిరిజన హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నారని చెప్పారు. కురుడి, డుంబ్రిగూడ, బల్లగరువు, పోతంగి, అనంతగిరి, పాడేరు, అరకు, పెద్దబాడు వంటి గిరిజన ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ స్వయంగా పర్యటించి సమస్యలు అర్థం చేసుకున్నారని చెప్పారు.

'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాలకు రూ.1,005 కోట్లతో సుమారు 1,069 కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని తెలిపారు. పీఎం జన్మన్ నిధుల నుంచి రూ.555 కోట్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2,525 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.50 కోట్లు కేటాయించి గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

బాక్సైట్ మైనింగ్, హైడ్రో ప్రాజెక్టుల విషయంలో పర్యావరణం, గిరిజనుల జీవన విధానానికి ఎలాంటి హాని కలగకుండా చూస్తామని స్పష్టం చేశారు.

# అన్నదాతలకు అండగా ఉంటాం

వేదికగా ఆయన తన సందేశాన్ని పంచుకున్నారు.రైతు సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా ఇప్పటికే 'పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ' పథకం మొదటి విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. త్వరలో ప్రారంభం కానున్న 'వీబీ–జీ ర్యామ్ జీ' ప్రాజెక్టుల ద్వారా కూడా రైతులకు మేలు చేకూరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక విధానాలతో పనిచేస్తోందని పవన్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ సేవలు సులభతరం.. ఫిర్యాదులకు 'మనమిత్ర'

దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను (పీజీఆర్ఎస్) మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను సులభంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేలా ఆన్‌లైన్ పోర్టల్‌తో పాటు, 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా ప్రత్యేక సేవలను ప్రారంభించాలని సూచించారు. కేవలం టెక్స్ట్ మెసేజ్‌లే కాకుండా, వాయిస్ మెసేజ్‌ల రూపంలో పంపే ఫిర్యాదులను కూడా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**క్షేత్రస్థాయికి అధికారులు.. కనెక్టివిటీకి డెడ్‌లైన్**

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా సెక్రటరీలు నెలకు 3 రోజులు, శాఖాధిపతులు (హెచ్‌ఓడీలు) 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేస్తూ సర్క్యులర్ జారీ చేసినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలో మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ ప్రాధాన్యతను నొక్కిచెప్పిన ముఖ్యమంత్రి, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,000 ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, రాబోయే మూడు నెలల్లో నెట్‌వర్క్ సంస్థలతో మాట్లాడి ఈ సమస్యను అధిగమించాలని డెడ్‌లైన్ విధించారు.

**'నవచేతన'పై సమీక్ష.. ఆర్టీజీఎస్ పనితీరుకు ప్రశంసలు**

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న 'నవచేతన' (ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్) కార్యక్రమంపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను అంచనా వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 33,949 మంది పిల్లలకు స్క్రీనింగ్ పూర్తి చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, ఇళ్లకు వెళ్లి కూడా ఈ స్క్రీనింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఈ సమీక్షకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, ఇతర ప్రతినిధులతో కలిసి సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ పనితీరును, పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీల వినియోగాన్ని ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సీఐఐ ప్రతినిధులకు వివరించారు. సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను వీలైనంత త్వరగా ఏపీలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం.. ఆస్తులు జప్తు చేశాం: అనిత

గంజాయి సాగును రికార్డు స్థాయిలో దాదాపు సున్నాకు చేర్చామని, దీని కారణంగా ఏపీలో నేరాల రేటు ఏకంగా 14 శాతం తగ్గిందని ఏపీ హోంమంత్రి అనిత వెల్లడించారు.రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటి వేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వింగ్ 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని హోంమంత్రి కొనియాడారు. ఈ స్పెషల్ ఆపరేషన్ల ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిగా దహనం చేసినట్లు తెలిపారు. కేవలం మత్తు పదార్థాలను సీజ్ చేయడమే కాకుండా... అంత రాష్ట్ర స్మగ్లర్లకు చెందిన సుమారు రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు.యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో ఏజెన్సీ ఏరియాల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని, డ్రగ్స్ సమాచారాన్ని గోప్యంగా అందించడానికి 'ఈగల్' కొత్త వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని అనిత తెలిపారు.

# అన్నదాతకు సీఎం ఏరువాక పున్నమి శుభాకాంక్షలు

తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ రైతన్నలు సాగుతో సిరులు పండించాలని కోరారు.అన్నదాతలకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం చాటి చెప్పేదే ఏరువాక పున్నమి అని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.




# ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో పరిష్కరించాలి

## జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 29)**
జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యల పై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 125 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే జిల్లా ఎస్పీ వెళ్లి ఫిర్యాదు లను స్వీకరించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ , ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్ సుధాకర్, డిటిసి డిఎస్పీ అబ్దుల్ కరీం, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.





ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

30.06.26 మంగళవారం


# 20 ఏళ్లుగా గెజిట్ కోసం ఎదురుచూపులు

**వెలుగొండ నిర్వాసిత కుటుంబం ఆవేదన**

**అర్హత ఉన్నా పేరు చేర్చలేదని కలెక్టర్‌కు వినతి**

**అన్ని అర్హతలు ఉన్నా అప్లికేషన్లు ఎందుకు పరిశీలించట్లేదు**

**అప్లికేషన్లను పరిశీలించకుండా చెత్తబుట్టలో వేస్తున్నారా ఏంటంటూ**

**ఎస్‌డిసి ని ప్రశ్నించిన జిల్లా కలెక్టర్ విజయసునీత**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)**

మార్కాపురం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోవడం లేదు. పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన గుడిపాటి మల్లికార్జున కుటుంబం గత 20 ఏళ్లుగా గెజిట్ జాబితాలో పేరు చేర్చాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందని సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతకు వినతిపత్రం అందజేశారు. బాధితుడి తల్లి గుడిపాటి బాలమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా, కుటుంబ సభ్యులందరి పేర్లు గెజిట్ జాబితాలో నమోదయ్యాయని, పెద్ద కుమారుడైన గుడిపాటి మల్లికార్జున కుటుంబం పేరు మాత్రమే ఇప్పటికీ నమోదు కాలేదని తెలిపారు. పలుమార్లు అధికారులు విచారణ నిర్వహించి అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు పేరు చేర్చకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమది తరతరాలుగా కలనూతల గ్రామంలో నివసిస్తున్న వడ్రంగి కుటుంబమని, అప్పటి సర్వేలో పాల్గొని పలక పట్టుకొని తమ కుటుంబ సభ్యులు అందరూ కూడా ఫోటో దిగారన్నారు. అది కూడా సమర్పించామని, అన్ని అర్హతలు ఉన్నా తమ కుటుంబాన్ని విస్మరించడం వల్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి కూడా దూరమయ్యామని మల్లికార్జున వాపోయారు. ఇప్పటికైనా గెజిట్ జాబితాలో పేరు చేర్చి తొలి దశలోనే పునరావాస ప్యాకేజీ మంజూరు చేయాలని కోరారు. (తరువాయి 4లో...)



## 20 ఏళ్ల నాటి వెలుగొండ ప్రాజెక్టు

# నిర్వాసితుల కల నేటితో నెరవేరింది

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)

ఈ నెల 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్ట్ పర్యటన సందర్భంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం మండలంలోని అక్కచెరువు తండా గ్రామవాసులు స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని తమ గ్రామానికి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూసినా వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు నేడు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు జమ అవ్వడంతో గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారని అన్నారు. నిర్వాసితులు తమ గ్రామాలను ఖాళీ చేయడం కొంత బాధగా ఉన్న ఈ ప్రాజెక్టుతో 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి త్రాగునీరు లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమను నిలువునా దగా చేసిందని, కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు (తరువాయి 4లో...)

# వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)**

వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. మండలంలోని వేములకోట గ్రామంలో సోమవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు, మంచి విత్తనాలతో వ్యవసాయం చేస్తే అనుకున్న ఫలితాలు పొందవచ్చన్నారు. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం ఉన్నందున ప్రభుత్వం చెప్పిన విధంగా, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులు సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. ఈ యాప్‌లో ఇప్పటివరకు 1.15 లక్షల మంది రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని వివరించారు. హార్టికల్చర్ హబ్ లో పశ్చిమ ప్రాంతాన్ని చేర్చడం ప్రభుత్వం ముందు చూపుకు నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చే 3 సంవత్సరాల్లో 63 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగే లక్ష్యంగా ప్రభుత్వం (తరువాయి 4లో...)

# పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**కిలో పొగాకు రూ.200 తగ్గకుండా కొనుగోలు చేయాలి**

**రైతుల కష్ట కాలంలో కంపెనీలు పొగాకు కొనుగోలుకు ముందుకు రావాలి**



**మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 29)**

పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. కిలో పొగాకును కనీసం రూ.200కు తగ్గకుండా కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు కల్పించాలని పొగాకు కొనుగోలుదారులను కోరారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం (తరువాయి 4లో...)

# నార్కోటిక్స్ పై మరింత నిఘా పెట్టాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 29)**

నార్కోటిక్స్ పై మరింత నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. సోమవారం ఆన్ లైన్ లో జిల్లాస్థాయి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. గత సమావేశం అనంతరం జిల్లాలో తీసుకున్న చర్యలను నోడల్ ఆఫీసర్ అయిన ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఆయేషా బేగం ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో 330 ' కేర్ ' కమిటీ సమావేశాలు నిర్వహించామని, గత నెలలో 38 అవగాహన సమావేశాలు పెట్టామని, 147 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వ్యసనం నుంచి విముక్తి కల్పించేందుకు ప్రస్తుతం జిల్లాలో 13 మంది ఇన్ పేషెంట్లు, 263 మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ (తరువాయి 4లో...)

# రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జూన్ 29)

రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామాయపాలెం గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి సాంప్రదాయ పద్దతిలో పూజలు నిర్వహించి ఏరువాక కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించి స్వయంగా నాగలి పట్టి దుక్కి దున్నడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. రైతు కష్టాలు తెలిసిన రైతు బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. రైతులకు పెట్టుబడి కష్టాలు రాకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా ప్రతి రైతు ఖాతాలో అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ కార్యక్రమం కింద సంవత్సరానికి 20 వేల రూపాయలు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2014-15లో రైతు రథాలు పథకం కింద ట్రాక్టర్లు ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తూ యాంత్రీకరణలో భాగంగా రైతుల అవసరాలకు అనువైన యంత్రాలను సబ్సిడీతో ఇవ్వడం జరుగుచున్నదన్నారు. ప్రతి రైతు యూరియాను క్రమపద్ధతిలో వినియోగించేలా ఒక యాప్‌ను కూడా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అలాగే పొలం బడి పిలుస్తోంది అనే కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన సలహాలను, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఉద్యాన పంటలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతుకు సాగు ఖర్చు తగ్గించి, ఆదాయం పెరిగేలా అన్నీ చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు దేశంలో ఎక్కడ లేని విధంగా పెద్ద మొత్తంలో అమలు చేస్తున్న ప్రభుత్వం మనదేనని ఆయన తెలిపారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లుల ఖాతాలలో 13 వేల రూపాయలు చొప్పున నగదు జమజేస్తున్నట్లు మంత్రి చెప్పారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ, దివ్యాంగ శక్తి పథకం కింద దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువకావడంతో , వాటి వలన కాన్సర్ వంటి పలు రకాల వ్యాధులకు మనం గురవుతున్నామన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గించడంతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా వ్యవసాయశాఖ అధికారులు పనిచేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి ఒక అవార్డు రావడం జరిగిందన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. మద్రిపూడి మండలంలో (తరువాయి 4లో...)



# రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది











తాగునీరు, సాగునీటి సదుపాయానికి అన్నీ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక సంప్రాదాయ పద్ధతిలో సోమవారం నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాడు వ్యవసాయ రంగంలో నెలకొని ఉన్న పరిస్థితులకు నేడు వ్యవసాయ రంగంలో నెలకొని వున్న పరిస్థితులకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఆనాడు వ్యవసాయ రంగం నకు సంబంధించి ఏ భూమి కి ఏ పంట వేయాలి, ఎక్కడ మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయి, సాగు విధాన, ఎలా చేయాలి అనే సూచనలు, సలహాలు ఇచ్చేవారు లేరని, కేవలం వర్షం పై ఆధారపడి సాగు చేసుకునే వారన్నారు. నేడు ఆ పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. నేడు ప్రతి గ్రామంలో, మండలంలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారులు ఉన్నారన్నారు. వారి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతన్న మీ కోసం కార్యక్రమం కింద ఏ కాలంలో ఏ పంట పండించాలి, ఏ పంటకు గిట్టుబాటు ధర లభిస్తుంది తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుచున్నదన్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి వ్యవసాయ పద్ధతులు, ఆధునిక పద్ధతుల్లో ఎక్కువ శాతం పురుగు మందులు, రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువైందన్నారు. యూరియాను ఎక్కువగా వాడటం వలన అనేకరకమైన నష్టాలు ఉన్నాయని, క్యాన్సర్ కు ముఖ్యమైన కారణమేమంటే యూరియా, యూరియా వాడకంను తగ్గించాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతు తన పొలంలో కనీసం 10 సెంట్ల భూమిలో ప్రకృతి వ్యవసాయం చేపట్టినట్లయితే మార్పుకు శ్రీకారం చుట్టినవారౌతారని కలెక్టర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతుకు అవగాహన కల్పించేలా వ్యవసాయశాఖ అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆర్థిక తోడ్పాటు కల్పించడం జరుగుచున్నదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. తొలుత ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఆవశ్యకతను, జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను వ్యవసాయశాఖ జెడి శ్రీనివాసరావు వివరించారు. ఈ సందర్భంగా సిఎంఆర్ చెక్కులను, రైతులకు సబ్సిడీతో నవధాన్యాల కిట్‌లను అందచేయడం జరిగింది. అంతకు ముందు గ్రామంలో 45 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, సైడు కాలువలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశి, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ తిరుపతమ్మ, పశు సంవర్ధకశాఖ జెడి వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపిచంద్, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసరావు, సెరికల్చర్ శాఖాధికారి డాక్టర్ సుజయ్, ప్రకృతి వ్యవసాయ అధికారి సుభాషిని, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం







సందర్శించిన మంత్రి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేలం నిర్వహణ, ధరల పరిస్థితి, కొనుగోళ్ల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, కొనుగోలు సంస్థల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టారని తెలిపారు. 29 పొగాకు కొనుగోలు కంపెనీలు ఉన్నప్పటికీ, వేలంలో కేవలం 9 నుంచి 10 కంపెనీలు మాత్రమే పాల్గొంటున్నాయని తెలిపారు. అన్ని కంపెనీలు తప్పనిసరిగా వేలాల్లో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. అలాగే వేలం కేంద్రాల్లో బిడ్లు లేకుండా ఉండే పరిస్థితి తలెత్తకుండా పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు వ్యవస్థను మరింత పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొగాకు రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వం, కొనుగోలు సంస్థలపై ఉందని మంత్రి అన్నారు. ఏ కంపెనీ రోజుకు ఎంత మేరకు కొనుగోలు చేయాలన్న నిబంధనలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాలువల మరమ్మతులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందించడంతో ఈ ఏడాది దిగుబడి పెరిగిందని చెప్పారు. దిగుబడి పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల ప్రభావంతో కొన్నిసార్లు ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా, రైతులకు నష్టం జరగకుండా కొనుగోలు సంస్థలు ముందుకు రావాలని కోరారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ధరల్లో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం రైతుల తరపున కొనుగోలు సంస్థలతో చర్చించి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులకు అనుకూలమైన ధరలు లభించేలా కంపెనీలపై అవసరమైన ఒత్తిడి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

**రాజధానిపై వైసీపీ ద్వంద్వ వైఖరి..**

**జగన్ బ్యాచ్‌ను తరిమికొట్టిన రైతులు**

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలే ఆ పార్టీ నేతలను అమరావతిలో ప్రజలు తిరస్కరించే పరిస్థితికి దారితీశాయని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. మద్దిపాడు-వెల్లంపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం సోమవారం మీడియాతో మాట్లాడిన మంత్రి, ఎన్నికలకు ముందు అమరావతిలో ఇల్లు కట్టుకున్నానని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను అయోమయంలోకి నెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై స్పష్టమైన వైఖరి లేకుండా రోజుకో మాట మాట్లాడటం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. రాష్ట్రానికి శాశ్వత రాజధాని లేకుండా చేయాలన్న ధోరణితోనే వైసీపీ వ్యవహరించిందని విమర్శించారు. అందుకే ఇటీవల అమరావతికి వచ్చిన వైసీపీ నేతలను రాజధాని రైతులు, స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పేర్కొన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి రాజధాని ఉన్నప్పటికీ, జగన్ తీసుకున్న నిర్ణయాల కారణంగా ఆంధ్రప్రదేశ్ మాత్రమే రాజధాని విషయంలో అనిశ్చితిని ఎదుర్కొందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన భూముల్లో రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేయడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.

## 20 ఏళ్ల నాటి వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కల నేటితో నెరవేరింది







ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేయటం తమకు సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈ, స్థానిక గ్రామస్తులు, మండల తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలి





ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. రైతులు వ్యవసాయం పట్ల మక్కువగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని తెలిపారు. మార్కాపురం నియోజవర్గంలో మొదటి దశలో 16 వేల హెక్టార్లలో పండ్ల తోటలు పెంపకానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో 40 గ్రామాలకు త్వరలో తారు రోడ్లు వేయబోతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ ఇన్చార్జి అధికారి బాలాజీ నాయక్, ప్రకృతి వ్యవసాయ విభాగం డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ సుదర్శన్ రాజు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ జెనెమ్మ, ఉద్యాన శాఖ అధికారి రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# 20 ఏళ్లుగా గెజిట్ కోసం ఎదురుచూపులు



**అధికారుల పై కలెక్టర్ ఆగ్రహం**

నిర్వాసితుల ఫిర్యాదుల పై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అర్హతలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత కూడా గెజిట్ జాబితాలో పేరు ఎందుకు చేర్చలేదని ఎస్‌డిసి అధికారి సత్యనారాయణను నిలదీశారు. వినతిపత్రాలను సక్రమంగా పరిశీలిస్తున్నారా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా అప్లికేషన్లను పరిశీలిస్తున్నారా లేక చెత్తబుట్టలో పడేస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# నార్కోటిక్స్ పై మరింత నిఘా పెట్టాలి

మరింత నిఘా అవసరమని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను ప్రతినెల కచ్చితంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ నార్కోటెక్స్ నిర్మూలనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినందున పోలీసు శాఖ పరంగా సోదాలను విస్తృతం చేసామన్నారు. ఈ సమావేశంలో డీఈవో రేణుక, ఆర్‌ఐ ఓ ఆంజనేయులు, డిఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సమగ్ర ఓటర్ల సర్వే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 29)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తర్లుపాడు మండల తెలుగుదేశం నాయకులతో కలిసి సోమవారం మండలంలోని సీతా నాగులవరం, తర్లుపాడు, మీర్జాపేట, గొల్లపల్లి, నాగెళ్ళ ముడుపు, తాడివారి పల్లి, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు, బుడ్డపల్లి, గానుగపెంట గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమం గురించి తెలుగుదేశం నాయకులు తీసుకోవాలని, జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ దొంగ ఓట్లు పట్ల అప్రమత్తంతో వ్యవహరించాలని దొంగ ఓట్లను తొలగించడానికి స్థానిక బీఎల్ఓలకు ఆధారాలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మార్కెట్ యార్డు ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, తర్లుపాడు మండల మాజీ జడ్పిటిసి రావి భాషాపతిరెడ్డి, మండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, గోపీనాథ్ చౌదరి, మండలంలోని ఆయా గ్రామాల బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, మండల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

వాటిని త్వరితగతిన పరిష్కరించాలి

సంబంధిత అధికారులను ఆదేశించిన

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 85 ఫిర్యాదులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుటకు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుదిక్కుల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల రాతపూర్వక వినతులను జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫిర్యాదుదారుల వివరాలు తెలియజేసి, తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, భాధితులకు న్యాయం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా నిర్ణీత గడువులో ఫిర్యాదులు పరిష్కారించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారిలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో లేదా నడవలేని స్థితిలో ఉన్నవారు కూడా ఉంటారని, అటువంటి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపి, మర్యాద పూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పూర్తిగా విని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేధింపులు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలు, చీటింగ్ మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ డి ప్రసాద్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, కందుకూరు సీఐ అన్వర్ బాష, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు జనార్ధన్‌రావు, యాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏరువాక పున్నమి రైతు సంప్రదాయానికి ప్రతీక వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



## ఎమ్మెల్యే ఏలూరి

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 29)

తెలుగు రైతాంగానికి అత్యంత పవిత్రమైన పండుగల్లో ఏరువాక పున్నమి ఒకటి. భూమాతను, పశుసంపదను ఆరాధిస్తూ ప్రకృతితో మనిషికున్న అవినాభావ సంబంధాన్ని చాటిచెప్పే ఈ పండుగ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతాంగానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు రైతులు నేలతల్లికి నమస్కరించి, ఎడ్లను అలంకరించి కొత్త సాగు పనులకు శ్రీకారం చుట్టడం తెలుగు సంప్రదాయంలో ఒక విశిష్టమైన ఆచారమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. తొలకరి జల్లులతో నేల పదునెక్కిన వేళ, ఎడ్లకు పూజలు చేసి, కొత్త నాగలితో పొలంలో తొలి దుక్కిని ప్రారంభించడం పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయమని, ఇది వ్యవసాయానికి, రైతుల జీవనానికి పశు సంపదకు ఉన్న విడదీయరాని బంధాన్ని తెలియజేస్తుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి, రైతుల ఇళ్లు సిరిసంపదలతో కళకళలాడాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇప్పటికే తొలి విడత పీఎం-కిసాన్ -- అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి తమ నిబద్ధతను నిరూపించుకున్నామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించేందుకు, పంట కాలంలో ఎదురయ్యే సమస్యలను అధికమైన శ్రద్ధతో పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదేవిధంగా, సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రైతులకు అవసరమైన రుణ సదుపాయాలను సులభతరం చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వారిని సాంకేతికతతో అనుసంధానం చేసేందుకు కూడా కృషి చేస్తున్నామని వివరించారు. రైతులు ఆందోళన చెందకుండా, ధైర్యంగా సాగు పనులు చేపట్టాలని, ఎదురయ్యే ఏ సమస్యకైనా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. ఏరువాక పున్నమి పర్వదినం రైతుల జీవితాల్లో నూతన ఆశలు, సిరిసంపదలు తీసుకురావాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బాలాలయ ప్రతిష్ట కార్యక్రమాలు

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూన్ 29)

మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని పునర్ నిర్మించాలని సంకల్పం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రావి కొయ్యతో స్వామివారి బింబాన్ని తయారుచేసి ఆలయాన్ని ఏర్పాటు చేసి బాలాలయ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. 29వ తేదీ ప్రారంభమైన బాలలయ ప్రతిష్ట కార్యక్రమం 1వ తేదీ వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ తెలిపారు. ఆలయ పునర్ నిర్మాణానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ సహకారంతో కోటి రూపాయల నిధులు దేవాదాయ శాఖ తరపున మంజూరు చేయడం జరిగిందని, దాతల సహకారంతో మరో 64 లక్షల రూపాయలు విరాళాలు అందడం జరిగిందని, త్వరలోనే ఆలయ పను ప్రతిష్ట పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్ కు, దాతలకు దేవస్థాన కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మార్నేని రాఘవ, కోటేశ్వరమ్మ దంపతులు, ఈవో లీలా కృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు మార్నేని కృష్ణారావు, గుళ్ళపల్లి శ్రీనివాసరావు, గాలి వెంకట రాంబాబు, సింగరాజు అరుణ్ కుమార్, ఇంటూరి అనంతలక్ష్మి, మర్రిపూడి పద్మావతి, డొక్కా రమాదేవి, ఏల్చూరి శేషయ్య, యాగ్నికులు దివి వెంకట శేషాచార్యులు, 9 మంది రుత్వికులు, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకట చార్యులు రాజశేఖర ఆచార్యులు అధిక సంఖ్యలో గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.







# మాజీ టొబాకో బోర్డు వైస్ చైర్మన్ బాలినేని సీతయ్యకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు నివాళి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ఒంగోలులో మాజీ టొబాకో బోర్డు వైస్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర రైతు నాయకులు బాలినేని సీతయ్య దశదిన కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వాళ్లతో పాటు పిడిసిసి బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తదితరులు ఉన్నారు.

## అర్జీలను నిర్దిష్టమైన గడువులోపు పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో అందిన అర్జీలను నిర్దిష్టమైన గడువులోపు పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యు అధికారి మాధురి, ఎస్‌డీసీ శాంతి లక్ష్మి, డిపిఓ వెంకటేశ్వరరావులతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ద చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అలాగే సంబంధిత అర్జీలు రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్‌యల్ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 268 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు నిధులు జమ

కుటుంబ పెద్దలకు 11,76,000

యువతకు ఒక్కొక్కరికి రూ.12.50 లక్షలు

ప్రభుత్వం పరిహారం అందజేత

మొదటి విడతలో రూ.300 కోట్ల నిధులు విడుదల

హర్షం వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సోమవారం పలు గ్రామాల నిర్వాసితులకు దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో నిర్వాసితుల వ్యక్తిగత అకౌంట్ ఖాతాలో ఒక్కొక్క నిర్వాసితుడికి రూ.12.50 లక్షల నగదును అకౌంట్లో జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. దీంతోపాటుగా ఫస్ట్ అవార్డులో ఉన్న వారి పేర్లకు 2571మందికి మాత్రమే 300 కోట్లు జమ అయ్యాయని, రెండో, మూడో విడతలో మళ్లీ లబ్ధిదారు అకౌంట్లోకి డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల అకౌంట్లోకి డబ్బులు జమ కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్ బాబు కు కృతజ్ఞతలు తెలియజేశారు. దీంతో పాటుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. నిర్వాసితుల కుటుంబాలలో నారా చంద్రబాబు నాయుడు వెలుగులు నింపాడని, దీంతో పాటుగా నిర్వాసితుల కాలనీలు కూడా త్వరగా పూర్తిచేసి వారికి గృహాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ నేపథ్యంలో పలు గ్రామాల నిర్వాసితులు టపాసులు పేల్చి హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా అంకమ్మ తల్లి దేవాలయంలో పూజలు

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 29)



మండల కేంద్రమైన పొన్నలూరులో వెలిసినటువంటి అంకమ్మ తల్లి దేవాలయంలో సోమవారం ఏరువాక సందర్భంగా అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ పూజారి టి మధుబాబు మాట్లాడుతూ ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఏరువాక సందర్భంగా పూజలు నిర్వహించామని, అంకమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలకు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఒంగోలులో రూ.3.80 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభం

**- సబ్ స్టేషన్ నిర్మాణంతో లో వోల్టేజ్ సమస్యలకు చెక్**
**-నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం - మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 29)**

ప్రజలకు లో వోల్టేజ్ సమస్యలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఒంగోలు హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ.3.80 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటివరకు 25 సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వాటిలో కొన్ని ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, మిగిలినవి తుది దశలో ఉండటంతో త్వరలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. మరోవైపు యర్రగొండపాలెంలో సుమారు రూ.70 కోట్లతో ట్రాన్స్ కో 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కొనసాగుతోందని, కొత్తపట్నం, తాళ్లూరులోనూ కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా ఒంగోలు నగరంలో 240 విద్యుత్ టవర్ల నిర్మాణం చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే



ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.1.20 లక్షల విలువైన 2 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. బీసీ వినియోగదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో రూ.98 వేల సబ్సిడీ, ఓసీ వినియోగదారులకు రూ.78 వేల సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ రంగ అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా మౌలిక వసతులను విస్తరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతిందని విమర్శించారు. రాబోయే వ్యవసాయ సీజన్‌కు ముందే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తదితర మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసి, రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. రైతులకు పగటిపూటే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు టంగా సాంబశివరావు, నామినేని కిరణ్,







# వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలి

## ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వినతి



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 29)**

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులలో అర్హత ఉన్నప్పటికీ, పునరావాస (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ ఎలిజిబుల్ లిస్ట్‌లో పేర్లు లేని ప్రతి ఒక్కరికీ తక్షణమే న్యాయం చేయాలని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాధితులు కలిశారు. అర్హత ఉన్నప్పటికీ లబ్ధిదారుల జాబితాలో కొందరి పేర్లు విస్మరించడంపై ప్రిన్సిపల్ సెక్రెటరీ కు నిర్వాసితులతో కలిసి ఆయన ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ ప్రభుత్వం ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తి స్థాయిలో అందాలన్నారు. సాంకేతిక కారణాలు లేదా ఇతర లోపాల వల్ల అర్హులైన లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేకుండా పోయాయని, దీనివల్ల వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, తక్షణమే సవరించిన జాబితాలో చేర్చాలని కమిషనర్‌ను కోరారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అర్హులైన చివరి లబ్ధిదారునికి కూడా ప్యాకేజీ అందేలా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం స్వీకరించిన ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈ సమస్య పై సానుకూలంగా స్పందిస్తూ అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# సమగ్ర ఓటర్ల సర్వే పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించండి

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 29)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో మార్కాపురం పట్టణ తెలుగుదేశం నాయకులతో, కార్యకర్తలతో సోమవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర ఓటర్ల సర్వే పై తెలుగుదేశం బిఎల్ఏలు ప్రతి ఇంటికి వెళ్లి బిఎల్ఓ లతో కలిసి ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయాలని, అదేవిధంగా దొంగ ఓట్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# హమాలీ యూనియన్ సమ్మెను జయప్రదం చేయాలి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)**

ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను జయప్రదం చేయాలని ఒంగోలు సివిల్ సప్లై ముఠా కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. స్థానిక ఒంగోలు సివిల్ సప్లై గూడ వద్ద నిరసన కార్యక్రమం, కార్మికులు సమ్మె నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సివిల్ సప్లై ముఠా కార్మికులకు 2026 జనవరి నుండి ఏరియర్స్ బకాయిలు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న బిల్లులు ఇవ్వాలని, కూలి రేట్లు పెంచాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై ముఠా కార్మికులు సమ్మె చేయడం జరుగుతుంది . జిల్లా వ్యాప్తంగా అన్ని సివిల్ సప్లై గూడెంలో పనిచేస్తున్న కార్మికులు బంద్ చేసి సమ్మె చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై గూడలో సుమారుగా 6000 మంది ముఠా కార్మికులు పనిచేస్తున్నారు. 2025 డిసెంబర్ నాటి కూలి రేట్లు ప్రకారం వేతనం చెల్లిస్తున్నారు. 2026 జనవరి నుండి కూలి రేట్లు పెంచమని నేటికీ కూడా కూలి రేట్లు అమలు కావట్లేదు పెంచిన కూలి రేట్లు అమలు కావడం లేదు జనవరి నుండి పెరిగిన కూల్ రేట్లు ప్రకారం ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని, అలాగే రోజు రోజుకి పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర ధరలు నిరంతరం పెరిగిపోతాయి సివిల్ సప్లై ముఠా కార్మికులకు నెలల తరబడి బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. దీని కారణంగా సివిల్ సప్లై ముఠా కార్మికులు కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులతోటి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రతినెల 5వ తారీఖు లోపల పెండింగ్లో ఉన్న బిల్లులు అలాగే ప్రతి నెల 5 తారీకు లోపల బిల్లులు చెల్లించాలని తెలియజేశారు. ప్రమాదం చేస్తూ విధులు నిర్వహించే క్రమంలో చనిపోయిన సప్లై ముఠా కార్మికులకు ప్రభుత్వం పది లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే వైద్య సదుపాయాలు ఖర్చులు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని, చనిపోయిన, రిటైర్ అయిన ముఠా కార్మికులకు పిఎఫ్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే పెరిగిన ధరలు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని, కొత్త షాపులు విధానాన్ని కార్మికులు సమక్షంలో చర్చించి మార్చే విధానాన్ని అమలు చేయాలని, పిఎఫ్ రికార్డులు సరిచేయాలని కార్మికులు కనీస సౌకర్యాలు మంచినీళ్లు, మరుగుదొడ్లు తదుపరి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా సమ్మెసందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం వెంకట్రావు, నాయకులు చంద్ర, సుధాకర్, వెంకటాద్రి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయం

## ఓట్ల గల్లంతు పై వైసీపీ నేతలు డీఆర్వోకు వినతి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 29)**

ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కు పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సమరశంఖం పూరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా సోమవారం కడప నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారిని వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు కలిసి పలు కీలక అంశాల పై సుదీర్ఘంగా చర్చించారు. వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్ బాషా, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, సీఈసీ సభ్యులు కే సురేష్ బాబుల ఆధ్వర్యంలో నేతలు అధికారుల ముందు ప్రజా సమస్యలను ఏకరవు పెట్టారు.

**సర్ గడువు పొడిగింపు :** ఎస్ఆర్ఏకు సంబంధించిన గడువును తక్షణమే పొడిగించి ప్రజలకు మరింత సమయం ఇవ్వాలని డీర్వోని కోరారు. మాజీ డిప్యూటీ సీఎం ఓటే గల్లంతు? ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలు, నిర్లక్ష్యానికి పరాకాష్టగా స్వయంగా మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా ఓటే ఓటర్ లిస్టులో గల్లంతైన విషయాన్ని ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. చాపాడు మండలంలో భారీగా ఓట్ల తొలగింపు: చాపాడు మండలంలో పెద్ద సంఖ్యలో అర్హులైన వైఎస్సార్సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులందరికీ తిరిగి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

**ప్రజల పక్షాన పోరాటం ఆపబోం! :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనది. అర్హులైన ఏ ఒక్క పౌరుడు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు. అధికారులు తక్షణమే స్పందించి తప్పులను సరిదిద్దాలి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం వైఎస్సార్సీపీ నిరంతరం పోరాడుతూనే ఉంటుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున, నాయకులు కేసీఆర్ సుధాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఫయాజ్, బన్న, తదితరులు పాల్గొన్నారు.



# ఆనారోగ్యంతో బాధపడే వారికి ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి

## నియోజకవర్గంలోని 60 మందికి రూ. 35,53,758ల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల




**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 29)**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం ఉదయం నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న 60 మందికి 20వ విడతగా మంజూరు అయిన రూ.35,53,758ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనారోగ్యంతో బాధపడే వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఆపన్న హస్తం అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, వారికీ అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చునన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేకమంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారని వారికీ అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 1138 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.9.62 కోట్లు అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ గుడిమె బాల స్వామికి “నంది” అవార్డు

## అవార్డుల కంటే “అక్షరమే” నా ఆయుధం

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 29)

నిరంతరం ప్రజాసమస్యలపైగళమె త్తుతూ, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను తన కలం ద్వారా ఎండగడుతున్న కడప జిల్లా ‘జ్యోతి’ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ గుడిమె బాలస్వామికిఅరుదైన, అత్యున్నత గౌరవందక్కింది. జర్నలిజం రంగంలో ఆయన చేసిన విశేష కృషికి, నిస్వార్థ సేవలకు గాను జాతీయ స్థాయిలో ‘ఉత్తమ జర్నలిస్ట్’ విభాగంలో ఆయన ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని జాతీయ స్థాయి స్వర్ణ నంది అవార్డు కైవసం చేసుకున్నారు. ఒక ప్రాంతీయ పత్రికలో అందులోనూ ఒక జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తూ మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఎండి శిరీషారెడ్డి, సినీ హీరోలు, డైరెక్టర్ లు ప్రసన్న కుమార్, ధన్ రాజ్, శివ ప్రసాద్ చేతుల మీదుగా జాతీయ స్థాయిలో అవార్డును అందుకున్నారు. ఇది కడప జిల్లాతో పాటు యావత్ తెలుగు పాత్రికేయ లోకానికే గర్వకారణంగా నిలిచింది.

**సామాన్యుడి పక్షాన నిలిచిన కలం :**

జర్నలిజం వృత్తిని కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించారు బాలస్వామి. దశాబ్దాలుగా జర్నలిజం వృత్తిలో నిబద్ధతతో పనిచేస్తూ, తన కలం ద్వారా ఎంతో మందికి న్యాయం చేకూర్చారు. కడప జిల్లాలోని శ్రీ అవధూత కాశినాయన మండలం అమగంపల్లె అనే మారుమూల పల్లెలో పుట్టి పెరిగి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ వరకు ఎదిగారు. ప్రతి సమస్యను వెలుగులోకి తీసుకురావడంలో ముందు వరుసలో నిలుస్తారు. కేవలం వార్తలు రాయడమే కాకుండా, ఆ వార్త వెనుక ఉన్న వాస్తవాలను, సామాన్యుడి ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన శైలి అద్వితీయం.

**‘జ్యోతి దినపత్రికలో సుదీర్ఘ ప్రస్థానం:**

‘జ్యోతి’ దినపత్రిక కడప జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా బాలస్వామి ప్రస్థానం ఎందరో యువజర్నలిస్టులకుఆదర్శం. ఒకవైపు పాలకులలోపాలనుధైర్యంగాఎత్తిచూపుతూనే,మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథ కాలుక్షేత్రస్థాయిలోఅర్హులకుచేరుతున్నాయా లేదా అన్న దానిపై ఆయనఎన్నో విశ్లేషణాత్మకకథనాలురాశారు.రాయలసీమ వెనుకబాటుతనం, రైతుల కష్టాలు,

### గుడిమె బాలస్వామి



నీటిసమస్యలు,సామాజికఅసమానతలు వంటి సున్నితమైన అంశాలపై ఆయ న రాసిన పరిశోధనాత్మక కథనాలు ప్రభు త్వాల్లో సైతం చలనం తీసుకు వచ్చాయి.

**అవార్డుల కంటే అక్షరమే నా ఆయుధం**
**గుడిమె బాలస్వామి**
**జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు**

సాధారణంగా జాతీయ స్థాయి పురస్కారాలు మెట్రో నగరాలకు చెందిన ఆంగ్ల లేదా జాతీయ మీడియా ప్రతినిధులకు దక్కుతుంటాయి అన్న అపోహను గుడిమె బాలస్వామి పటాపంచలు చేశారు. గ్రామీణ జర్నలిజంలో ఉన్న శక్తిని, వాస్తవాలను నిర్భయంగా చెప్పే తెగువను జాతీయ స్థాయి జ్యూరీ సభ్యులు ప్రత్యేకంగా గుర్తించారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన రిపోర్టింగ్, తీసుకు వచ్చిన సామాజిక మార్పును ప్రశంసిస్తూ జాతీయ స్థాయిలో ఈ “ఉత్తమ జర్నలిస్ట్-నంది అవార్డు” ను ప్రకటించారు.

**ప్రశంసల వెల్లువ :**

బాలస్వామికి జాతీయ అవార్డు రావడం పట్ల ఉమ్మడి కడప జిలా ్లవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కడప జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయనకు ఫోన్ చేసి ప్రత్యేకంగాశుభా కాంక్షలు తెలియ జేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా పక్షం వహించిన రిపోర్టర్‌కు తగిన గుర్తింపు లభించిందని రైతు సంఘాలు, విద్యార్థి సంఘాల నేత లు హర్షం వ్యక్తం చేశారు. తోటి పాత్రికేయ మిత్రులు, కడప ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ అవార్డు తమ అందరికీ దక్కినగౌరవంగాభావిస్తూఆనందంవ్యక్తం చేశారు. తమ సంస్థలో పనిచేస్తున్న ఒక డైనమిక్ రిపోర్టర్‌కు జాతీయస్థా యి అవార్డు రావ డం పట్ల ‘జ్యోతి‘ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

**నా కలం పేదల పక్షమే**
**గుడిమె బాలస్వామి**

అవార్డు అందుకున్న అనంతరం గుడిమె బాలస్వామి మాట్లాడుతూ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉంది. కానీ ఇది నా బాధ్యతను మరింత పెంచింది. నా కలం ఎప్పుడూ పేదలు, అణగారిన వర్గాలు, బాధితుల పక్షానే నిలబడుతుంది. నాలో స్ఫూర్తిని నింపి, స్వేచ్ఛగా వార్తలు రాసే అవకాశం కల్పించిన ‘జ్యోతి’ దినపత్రిక యాజమాన్యానికి, నన్ను ఎంత గానో ప్రోత్సహించిన కడప జిల్లా ప్రజలకు, తోటి జర్నలిస్టు మిత్రులకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నాను అని ఆయన ఉద్వేగంగా పేర్కొన్నారు. నిజాయితీ, నిర్భీతి, నిబద్ధత కలగలిపిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన గుడిమె బాలస్వామికి ఈ అవార్డు దక్కడం, వృత్తి పట్ల ఆయనకున్న అంకితభావానికి దక్కిన నిజమైన బహుమతి. ఆయన కలం నుండి మరిన్ని ప్రజాహిత కథనాలు జాలు వారాలని కడప జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం వద్ద బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ.32 లక్షలు మంజూరు

**టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబుకి ధన్యవాదాలు**



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 29)

శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం అభివృద్ధే ధ్యేయంగా ఎన్నో పనులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మంజూరు చేయించిన యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మరో ఘనత సాధించారు. ఇటీవల రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ నిధుల నుండి శ్రీ కాటమరాజు స్వామి వారి ఆలయం వద్ద బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేయించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ పెద్దారవీడు మండలం తరపున గూడూరి ఎరిక్షన్ బాబుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీను, క్లస్టర్ ఇంచార్జి జెండా రవి, కాటమరాజు దేవస్థానం ఉపాధ్యక్షులు గంగుల ఎల్లయ్య యాదవ్, మాజీ సర్పంచ్ ఇండ్ల రామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నా బోడిరెడ్డి, సీనియర్ నాయకులు చింతకుంట్ల సుబ్బరామిరెడ్డి, యూనిట్ ఇంచార్జి తోకల ఎల్లయ్య యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగాల అబ్రహం, మాజీ సర్పంచ్ యాన వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వెన్న వెంకట్ రెడ్డి ,తెలుగుదేశం పార్టీ నాయకులు కోనంగి పాలంకయ్య, మాజీ మండల ఉపాధ్యక్షులు పాముల పోలరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆనకాల శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాలి శ్రీను, వెన్నా వెంగల్‌రెడ్డి, తిరుమలరెడ్డి వెంకటరెడ్డి, బొచ్చు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు రాగల ఈశ్వర్ కుమార్, ఐటీడీపీ సభ్యులు మూడమంచు చిన్నబి, చేతుల నాగరాజు, కుర్రా శ్రీనివాసులు, దానం, యానా కాశి రాముల, అట్లూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం

**రూరల్ అధ్యక్షులుగా సన్నుతి హేమంత్ నియామకం**

**సన్నుతి హేమంత్‌కు నియామక పత్రాన్ని అందజేసి ప్రకటించిన జిల్లా అధ్యక్షులు**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 29)

కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం రూరల్ అధ్యక్షులుగా ఆదివారం ఉదయం పొద్దుటూరులోని ఆర్యవైశ్య యువజన సమాఖ్య కార్యాలయంలో జిల్లా అధ్యక్షులుగా సన్నుతి హేమంత్ ను ప్రకటించి వారికి శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ చేతుల మీదుగా అందజేసి ప్రకటించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన అధ్యక్షులతోపాటు సెక్రటరీ సివి నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ కమిటీ చైర్మన్ ఎలిశెట్టి ప్రసాద్,జిల్లా వాసవిసేవాదల్ అధ్యక్షులు గాజులపల్లి హరిగోపాల్, స్టేట్ ఆర్యవైశ్య సేవాదళ్ జనరల్ సెక్రటరీ గాజులపల్లి అభినయ్, పబ్బతి చక్ర పాణి,యువజన సమాక్య సభ్యులు తళ్లం సందీఫ్, వల్లంకొండు వెంకటేష్, కనమర్ల పూటి వంశీ కృష్ణ, అయ్యపు మనీయశ్వంత్, కాకుమాని చంద్రహాస్, మలపాటి చక్రదర్ పలువురు పాల్గొన్నారు.

# ఇన్స్పైరింగ్ ఆర్థోపెడిక్ సర్జన్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత

## డాక్టర్ చాపల వంశీ కృష్ణకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ఘన సత్కారం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ చీఫ్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ జాతీయ స్థాయిలో “టైమ్స్ నౌ” వార్తా సంస్థ అందించే “ఇన్ స్పైరింగ్ ఆర్థోపెడిక్ సర్జన్ ఆఫ్ ఇండియా” అవార్డును న్యూఢిల్లీలో ఈ నెల 27న అందుకున్న సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సోమవారం ఉదయం హాస్పిటల్ కు విచ్చేసి డాక్టర్ వంశీ కృష్ణని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు డాక్టర్ చాపల వంశీ కృష్ణకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ అవార్డు డాక్టర్ వ్యక్తిగత విజయమే కాకుండా, ప్రకాశం జిల్లా వైద్య రంగానికే గర్వకారణమని కొనియాడారు. రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ, మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ దంపతుల సేవలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు రెండు కోట్ల ముప్పై లక్షల రూపాయల విలువైన వైద్య సేవలను గడచిన మూడు సంవత్సరాల కాలంలో ప్రకాశం జిల్లా ప్రజలకు ఉచితంగా అందించినట్లు డాక్టర్ వంశీకృష్ణ, శాంత కుమారిలు ఎమ్మెల్యేకి తెలియజేశారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ గౌరవాన్ని తనపై ఉంచిన ప్రతి రోగికి, తన వైద్య బృందానికి, ఆసుపత్రి సిబ్బందికి , ఎల్లప్పుడూ తనను ప్రోత్సహిస్తున్న ప్రజలు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్మ వారి సేవ సంఘం అధ్యక్షులు మరియు సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీ కృష్ణ , మార్కెట్ యార్డు చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, స్థానిక సత్యనారాయణ పురం ప్రముఖులు, ఆసుపత్రి వైద్యులు, ప్రముఖులు, సిబ్బంది, అభిమానులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొని డాక్టర్‌కి శుభాకాంక్షలు తెలిపారు.











# కరాటేలో పొదిలి విద్యార్థుల ప్రతిభ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 29)

రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో మార్కాపురం జిల్లా పొదిలికి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో అత్యుత్తమ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి వడ్డె వేణును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. పోటీల్లో కటా విభాగంలో పోడిలికి చెందిన నాగిరికంటి వెంకట నాగ సాయి కీర్తిక ద్వితీయ స్థానం, నాగిరికంటి వెంకట నాగ సాయి ప్రతీక్ తృతీయ స్థానం సాధించారు. అలాగే అక్కుడాసు అన్షు, పొరాళ్ల ఉమా మహేశ్వర్ నాలుగో స్థానాల్లో నిలిచి ప్రతిభ చాటారు. విజేతలను నిర్వాహకులు, కరాటే శిక్షకులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా, రాష్ట్రానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.

# దాతల సహకారంతో సూరేపల్లి పాఠశాల విద్యార్థులకు పలకలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణి



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 29)

మండలంలోని సూరేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మార్కాపురం వాస్తవ్యులైన దాతలు సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి, కృష్ణకుమారిల చేతుల మీదుగా పలకులు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ నజీర్‌అహ్మద్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న దాతల సహకారం అభినందననీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# థాంక్యూ సీఎం సార్



- సీఎం చంద్రన్న చిత్రపటానికి క్షీరాభిషేకం
- గూడూరు కి గుడి కడతాం...
- నిత్య కృషివలుడు గూడూరుకి కృతజ్ఞతలు
- ఎరిక్షన్ బాబుకు అడుగడుగునా పులవర్షం
- నిర్వాసితుల కౌగిలిలో తడిసి ముద్దైన ఎరిక్షన్ బాబు
- నిర్వాసిత గ్రామాలలో హోరందుకున్న సంబరాలు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)

శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితల మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం గత ప్రభుత్వాల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లభించలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు ఒకవైపు వెలుగొండ నీరు ఇచ్చేందుకు సరే వేగంగా పనులు చేపట్టి మరోవైపు నిర్వాసితుల పెండింగ్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వారి ఖాతాలో జమ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సాధించి పూర్తి చేయాలన్న సంకల్పంతో చరవేగంగా పావులు కదుపుతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం వెలుగొండ ప్రాజెక్టు టెండలను సందర్శించి పనులను పరిశీలించి నిర్వాసితులకు పెద్ద భరోసా ఇచ్చారు. పెండింగులో ఉన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ 905 కోట్ల గాను 300 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నామని సోమవారమే వారి ఖాతాల్లో జమ అవుతాయని చెప్పిన 48 గంటల్లోనే హామీని నెరవేర్చడంతో నిర్వాసిత గ్రామాల్లో సంబరాలు హోరందుకున్నాయి. నియోజకవర్గ ఇన్చార్జిన్ ఎరిక్షన్ బాబు నేతృత్వంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని లోయ గ్రామాలలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ థాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. నియోజకవర్గ ఇన్చార్జి ఎడిక్షన్ బాబుకు సోమవారం పూలవర్షంతో



గ్రామ పోలిమేర నుంచి ఆహ్వానించారు. పెద్ద ఎత్తున నిర్వాసితులు సుంకేసుల్లో జరిగిన కార్యక్రమంలో నిర్వాసితులు పెద్ద ఎత్తున

హాజరై అభిమానాన్ని చాటుకున్నారు. ఎరిక్షన్ బాబుకు రుణం తీర్చుకోలేమంటూ వేదికపై నుంచే నేతలు ఆనందం వ్యక్తం చేశారు. దృశ్యాలవాలతో ఎరిక్షన్ బాబును సత్కరించి సంబరాలు చేసుకున్నారు. ఒకే రోజు 300 కోట్ల రూపాయలు వారి ఖాతాలో జమ కావడం ఆనందంగా ఉందని వెలుగొండ ప్రాజెక్టు నీరు ఇచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా చేస్తామంటూ ఎరిక్షన్ బాబు ప్రజల అశ్వద్ధానాల మధ్య ప్రకటించారు. కరువు కాటకాలతో అలమటించిపోతున్న పశ్చిమ ప్రాంతానికి చంద్రన్న దయతో త్వరలో విముక్తి అన్నారు. ఈ సీజన్లోనే వెలుగొండకు నీర్చి పంటలతో సస్యశ్యామలంగా ఈ ప్రాంతాన్ని ఆనందంగా చూడాలన్నదే తన కోరిక అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గొట్టశ్రీ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అనుముల ప్రసాద్, ఆశయ్య, పోలురాజు, తదితరులు పాల్గొన్నారు.





## సర్ పై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

సర్ పై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డు లోని పార్టీ కార్యాలయం నందు ఈరోజు మధ్యాహ్నం నుండి నియోజకవర్గంలోని క్లస్టర్ ఇంచార్జిలతో, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ గారు వారిని ఉద్దేశించి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేవిధంగా చూడాలి అన్నారు. మృతులు, డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓటర్లు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్ని తెలియజేసారు. జులై 14వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున గ్రామం మరియు డివిజన్లలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, క్లస్టర్ ఇంచార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 29)

తక్షణమే పరిష్కరించే అవకాశం వున్న అర్జీలను నిబంధనలకు లోబడి వెంటనే క్లియర్ చేస్తున్నట్లు తహశీల్దార్ జే ప్రభాకరరావు అన్నారు. సోమవారం మండల రెవెన్యూ కేంద్రంలో నిర్వహించిన పిజిఅర్ఎస్‌కు రెండు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. సర్వే నిమిత్తం సదరు అర్జీలు రాగా వాటిని స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి, ఎపిఓ లక్ష్మీ కుమారి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఏపిఎం జి పెద సుబ్బారావు, ఏఈ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది కొరతతో అవస్థలు పడుతున్న ఖాతాదారులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 29)

బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని వున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సిబ్బంది కొరతతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ముందుగా వున్న ఇద్దరు కర్ల్కు లు పదోన్నతి పొంది మరొక చోటుకు వెళ్లిపోయారు. ఒక ఫీల్డ్ ఆఫీసర్ బదిలీ అయ్యారు. ఖాతాదారులు ఎక్కువగా వున్నందు వలన సిబ్బంది తక్కువగా ఉండడం వలన బంగారు తనఖా పెట్టి వ్యవసాయ పనుల కు రుణం తీసుకొనే వాళ్లకు, వ్యవసాయ పాసుపుస్తకం పెట్టి తనఖా పెట్టి రుణం తీసుకోవాలన్న బ్యాంక్ లో పనులు కాక చంటి పిల్లలను తీసుకువచ్చే మహిళలకు గంటల గంటలు ఆలస్యంగా అవుతుండడం ఒక పని మీద వస్తే ఆ పని కాకపోవడంతో ఖాతాదారులు విసుగు చెందుతున్నారు. ఇక నైనా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజ్మెంట్ చొరవ చూపి బ్రహ్మంగారి మఠం బ్రాంచ్‌కు సిబ్బంది పంపిస్తారని ఖాతాదారులు ప్రజల కు మెరుగైన సేవలు అందిస్తారని కోరుతున్నారు.

# కందుకూరులో దళితుల పట్ల వైసీపీ వివక్ష

- వారికి రాజకీయ పదవులు రాకుండా అడ్డుకున్నది వాస్తవం కాదా?
- ఏఎంసీ చైర్మన్ పదవి భర్తీ చేయకుండా కుట్ర చేసిందెవరు?
- కేసులతో మునిసిపాలిటీ ఎన్నికలను అడ్డుకున్నది ఎవరో అందరికీ తెలుసు
- మా పాలనలో కష్టపడ్డ వారికే పదవులు
- జులై 4న ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం
- తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపు
- సీఎంఆర్ఎఫ్ ద్వా పేదలకు విరివిగా ఆర్థిక సహాయాలు
- ప్రభుత్వానికి భారం-అయినా ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యం
- ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
- గుడ్లూరు మండలంలో 38 మందికి రూ.23 లక్షల సహాయం

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 29)

కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ నేతలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. అవకాశం వచ్చినా సరే, దళితులను రాజకీయంగా ఎదగకుండా ఆ పార్టీ పెద్ద అణగదొక్కారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అందుకు నిదర్శనం. గత ప్రభుత్వంలో చైర్మన్ పదవి దళితులకు కేటాయిస్తే, రెండేళ్లపాటు ఎవరినీ నియమించలేదు. దళితులు ఎక్కడ ఎదుగుతారోనన్న భయంతో కుట్ర చేశారు. అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. గుడ్లూరు మండలంలో 38 మందికి సుమారు రూ.23 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 1400 మందికి పైబడి రూ.11.18 కోట్ల రూపాయల సహాయాలు అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 30 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే స్థానిక నేతలు, దళితులను చిన్నచూపు చూశారని విమర్శించారు. కోర్టులో అక్రమకేసులు వేయించి, మున్సిపాలిటీ ఎన్నికలను అడ్డుకున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. పెత్తందారీ, బూర్జువా రాజకీయాలకు కాలం చెల్లిందన్న సత్యాన్ని కొందరు నేతలు గ్రహించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హితవు పలికారు. బయటనుంచి రాళ్లు వేసే నేతలు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని, నియోజకవర్గంలో సుమారు రూ.450 కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులు వారి కళ్ళకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్ని రాళ్లు వేసినా తాను భరిస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల కోసం కేవలం అభివృద్ధి, సంక్షేమం పైనే దృష్టిపెట్టి ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేసినందుకు ఫలితంగానే, ఎస్సీ సెల్ నాయకులు రాయపాటి శ్రీనివాసరావు సతీమణి సుభాషిణికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయని, అందరికీ తప్పక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో కష్టపడ్డ అన్ని వర్గాలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. జులై 4వ తేదీన కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు వేడుకలకు హాజరవుతారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఉలవపాడు మండల అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, గుడ్లూరు మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీ నరసింహం, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గా నియమితులైన రాయపాటి సుభాషిణి, పార్టీ సీనియర్ నాయకులు షేక్ రఫీ, నాదెళ్ల రమణయ్య, కూనం నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.









On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్) వర్కింగ్ ప్రెసిడెంట్ గా దొంతు సతీష్ నియామకం





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 29)

కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్) వర్కింగ్ ప్రెసిడెంట్ గా వేంపల్లెకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ దొంతు సతీష్ నియమితులయ్యారు. వేంపల్లెకు చెందిన దొంతు తిరుపాలయ్య శెట్టి (లేట్) కుమారుడైన సతీష్‌ను ఈ పదవికి ఎంపిక చేసినట్లు కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ అధికారికంగా వెల్లడించారు. సోమవారం వేంపల్లెలోని అమ్మవారిశాలలో దొంతు సతీష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, నియామక పత్రాన్ని అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

**సేవా రంగంలో ముందున్నందుకు గుర్తింపు :**

ఈ సందర్భంగా వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ దొంతు సతీష్ సమాజ సేవలో నిరంతరం ముందుంటున్నారని కొనియాడారు. ప్రస్తుతం ఆయన వేంపల్లె ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీగా, వేంపల్లె అవోపా ట్రెజరర్‌గా, జిల్లా అవోపా జాయింట్ సెక్రటరీగా, గండి శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం జాయింట్ సెక్రటరీగా వివిధ బాధ్యతల్లో సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. ఆయన అందిస్తున్న నిరంతర సేవలను గుర్తించే జిల్లా కమిటీ ఈ కీలక పదవిని అప్పగించిందని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా పెద్దలకు, సంఘ సభ్యులకు దొంతు సతీష్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడిగా సోమిశెట్టి చిరంజీవి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 29)

పొదిలిలో అనేక సేవా కార్యక్రమాలతో గత మూడేళ్లుగా ప్రజలతో అనేక మన్ననలను పొందుతున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గత కమిటీ కాల పరిమితి ముగిసినందున సోమవారం సాయంత్రం దర్శి రోడ్డులోని స్థానిక మానవత కార్యాలయం నందు నాలుగవ సంవత్సరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా సోమిశెట్టి చిరంజీవి, కార్యదర్శిగా చిట్టెంశెట్టి కృష్ణ, కోశాధికారి గా బండి అశోక్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వై కిరణ్మయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు మానవత సభ్యులు అభినందించారు. రాబోయే సంవత్సర కాలం మరిన్ని సేవా కార్యక్రమాలతో మానవత స్వచ్ఛంద సంస్థ పేరు మరింత ముందుకు తీసుకువెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాకునూరి యల్లమందరెడ్డి, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, మువ్వల పార్థసారధి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, భవాని శ్రీను, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కరీముల్లా బేగ్, ధర్నాసి రామారావు, యక్కలి శేషగిరిరావు, భూమా సుమంత్, వరికుంట్ల వినోద్ రాజ్, మేడా శ్రీను, సంజీవ్‌రెడ్డి, ఓబులరెడ్డి, రంకెలా రెడ్డి, బొగ్గవరపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## విద్యార్థినుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## నాణ్యమైన వసతులు, మెరుగైన అవకాశాల పై ప్రత్యేక దృష్టి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి లావణ్య వేణి ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్ళను ఆకస్మికంగా సందర్శించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదట మద్దిపాడు మండలం యడుగుండ్లపాడు గ్రామాన్ని సందర్శించిన డైరెక్టర్, 'ప్రధాన్ మంత్రి ఆదర్శ గ్రామ యోజన' కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో పాటు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఒంగోలు భాగ్యనగర్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాలు 2, 3లను సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించారు. హాస్టళ్లలో అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పరిశుభ్రత, భద్రత తదితర అంశాలపై స్వయంగా విద్యార్థినుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత (పబ్లిక్ పర్సెప్షన్) గురించి అవగాహన కల్పించారు.



విద్యతో పాటు మంచి ప్రవర్తన, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల బాధ్యతాయుతమైన వైఖరి ప్రతి విద్యార్థిలో ఉండాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా జర్మన్ భాషా శిక్షణ అందిస్తున్నట్లు వివరించి, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న నెలల్లో విద్యార్థినులకు నైట్ డ్రెస్సులు, టవల్స్, దుప్పట్లు, స్పోర్ట్స్ షూస్, పడకలు తదితర అవసరమైన వస్తువులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి వసతి గృహంలో 'ఎంప్లాయ్‌మెంట్ న్యూస్' పత్రికను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా విద్యార్థినుల గదులు, భోజనశాల, వంటగది, స్టోర్‌రూమ్, వాషింగ్ ఏరియా తదితర విభాగాలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. పరిశుభ్రత, పారిశుధ్యం, నిర్వహణ ప్రమాణాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూ విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. చివరిగా సక్కుబాయమ్మ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాల పునరుద్ధరణ పనులను పరిశీలించి, నిర్మాణ పనులను అత్యున్నత నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు పూర్తి చేసి విద్యార్థినులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రబియా, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు శిరీష, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థినుల సంక్షేమం, నాణ్యమైన వసతి సౌకర్యాల కల్పన, మెరుగైన విద్యా, ఉపాధి అవకాశాల సృష్టికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు.





# ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ మహిళా గౌరవ అధ్యక్షురాలుగా శిద్దా లక్ష్మి పద్మావతి నియామకం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా గౌరవ అధ్యక్షురాలుగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మి పద్మావతిగా నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య సోమవారం మాజీ మంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో లక్ష్మి పద్మావతికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్య మహిళాల సంఘటితం నిమిత్తం లక్ష్మి పద్మావతి కి రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలుగా నియమించినట్లు తెలిపారు. అనంతరం లక్ష్మి పద్మావతి మాట్లాడుతూ ఆర్యవైశ్య మహిళా గౌరవ అధ్యక్షురాలు గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ శిద్దా రాఘవరావు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్, వాసవి సత్ర సముదాయాల ఆర్బిటేటర్ పెనుగొండ సుబ్బరాయుడు, వాసవి సత్ర సముదాయాల మెంబర్ దర్శి వాసు పాల్గొన్నారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు దేవకి వెంకటేశ్వర్లు, పెనుగొండ సుబ్బారాయుడు, ఇల్లూరి లక్ష్మయ్య, దర్శి వాసులను శాలువతో సత్కారించారు.

# డాక్టర్ శిద్దాను ఘనంగా సన్మానించిన దేవకి, ఇల్లూరు లక్ష్మయ్య, పెనుగొండ సుబ్బరాయుడు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కి అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా డాక్టర్ శిద్దా రాఘవరావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా పలువురు కలసి శుభాకాంక్షలు తెలియచేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియా వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య, ఆర్యవైశ్య మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్, వాసవి సత్ర సముదాయాల ఆర్బిటేటర్ పెనుగొండ సుబ్బరాయుడు, వాసవి సత్ర సముదాయాల సభ్యులు దర్శి వాసు, అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు, జె పంగులూరు, సంతమాగులూరు, మార్టూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు బయిసాన కోదండ రామ ప్రసాద్, కనమర్లపూడి శివశేషారావు, కొల్లిపర రామ సుబ్బయ్య, కొలిశెట్టి మస్తాన్‌రావు, కె గౌతమ్ ప్రసాద్, కోళ్లపూడి వెంకట బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ రుణాలను సద్వినియోగం అయ్యేలా చూడండి జిల్లా కలెక్టర్ విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 29)

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం అయ్యేలా చూడాలని వివిధ బ్యాంక్ శాఖల మేనేజర్లు ఇతర సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. సోమవారం మార్కాపురం కలెక్టరేట్లో డిస్టిక్ కన్సల్టేటివ్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక, ప్రభుత్వ సబ్సిడీ రుణాలపై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయేతర రుణాలు, కౌలు రైతులకు సీసీఏ ఆర్ కింద రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. అదేవిధంగా మార్కాపురం ప్రాంతాన్ని ఆర్టికల్చర్ హబ్ లో చేర్చినందున ఫుడ్ ప్రాసెస్ లోన్లు సైతం మంజూరయ్యే విధంగా చూడాలన్నారు. డిఆర్డిఏ, మెప్మా సిబ్బంది సైతం రుణాలు మంజూరు చేసి వాటిని సక్రమంగా వసూలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ షాహీర్, యూనియన్ బ్యాంకు డీజీఎం రవికుమార్, ఎస్‌బీఐ ఆర్ఎం అప్పలరాజు, ఏపీజీబీ ఆర్ఎం వెంకటేశ్వర్లు, రిజర్వ్ బ్యాంకు ఎల్బీఓ ఎలమందరెడ్డి, నాబార్డ్ డిడియం రవికుమార్, వ్యవసాయశాఖ జిల్లా ఇన్చార్జి అధికారి బాలాజీ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి రమేష్, మైక్రో ఇరిగేషన్ పీ డీ జెన్నెమ్మ, డిఆర్డిఏ ఏపీడి నీలకంఠారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.